పనులు సకాలంలో పూర్తి చేయాలి

సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కైలాస్‌హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్ : అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్లకు చెందిన ఇంజినీరింగ్ విభాగం అధికారులతో జీహెచ్ఎంసీ ఎంసీ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో కొనసాగుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జంట సర్కిళ్ల పరిధిలో అన్ని డివిజన్లలో పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టేందుకు సర్కిల్ కు రూ.7 కోట్ల చొప్పున 14 కోట్లు మంజూరు అయ్యాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వేలకోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, ఇంకా అక్కడక్కడ మిగిలిపోయిన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తెలియజేశారు. సమావేశంలో ఇంజినీరింగ్ ఈఈలు లక్ష్మి, గణేశ్, డీఈ పాపమ్మ, శిరీష, రూపా దేవి, ఏఈలు కల్యాణ్, తిరుపతి, అనురాగ్, అశోక్, స్వాతి పాల్గొన్నారు.

నీటిఎద్దడి ఏర్పడకుండా..

జంటసర్కిళ్ల పరిధిలోని వివిధ కాలనీల్లో తాగునీటి సరఫరా, నీటి లభ్యత, భూగర్భ డ్రైనేజీ పనులు, నూతన పైపులైన్ల నిర్మాణం వంటి వాటిపై జలమండలి అధికారులతో ఎమ్మెల్యే వివేకానంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. వేసవిలో జంట సర్కిళ్ల పరిధిలో నేటి సరఫరా, లభ్యతను దృష్టిలో ఉంచుకొని అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని, వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని భూగర్భ డ్రైనేజీ, వరదనీటి కాలువ, మంజీరా పైపులైన్ పనులను పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎంలు రాజేశ్, శ్రీకాంత్, రవీందర్ నాయక్, మేనేజర్లు రవి, శివ ప్రసాద్, మహేశ్, ఈశ్వరయ్య, రోహిణి, ఝాన్సీ, రమ్య భారతి, పూజిత పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాల భాగస్వామ్యం కీలకం

దుండిగల్ /కుత్బుల్లాపూర్ : ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు సంక్షేమ సంఘాలే వారధులని, కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల భాగస్వామ్యం కీలమని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద 125 – గాజుల రామారం డివిజన్ కైలాస్‌హిల్స్ కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించుకొనేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులు కాలనీలో నెలకొని ఉన్న దోమల బెడద, రోడ్లపై మురుగునీటి ప్రవాహం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షులు కె. సందేశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.సందీప్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రావు, కోశాధికారి రామ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పి.వేణు, ఎం.మాధవ చారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

దుండిగల్ : ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల17 (గురువారం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సన్నాహక సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి లోని జీతే ఫిర్ దర్గాలో బుధవారం నుంచి ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడుసలీం తెలిపారు. బుధవారం సందల్ ముబారక్, చిరాగ, శుక్రవారం మీనాబజార్ ఉంటుందన్నారు.

నివాసాల నడుమ ఆలయ నిర్మాణం వద్దు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : నివాస ప్రాంతాల నడుమ నిర్మిస్తున్న ఆలయ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ అధికారులకు కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల సుభాష్ నగర్‌కు చెందిన 65 ఏండ్ల వృద్ధుడు యాదగిరి ఫిర్యాదు చేశాడు. పూర్తిగా ఇండ్ల సముదాయాల నడుమ ఈ ఆలయాన్ని నిర్మించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని అదే సమయంలో అక్రమంగా నివాసాల మధ్య నిర్మించడం పూర్తిగా చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఆలయాల నీడ నివాసాలపై పడడం హిందువులు సంప్రదాయానికి విరుద్ధంగా భావిస్తారని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

దుండిగల్ :ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు మంగళవారం కృష్ణను కలిశారు. తమ ప్రాంతాల్లో సమస్యలు తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



దుండిగల్ : క్షయ వ్యాధి (టీబీ) గ్రస్తులు మందులు వాడడంతో పాటు పోషకాహారం తీసుకోవాలని దుండిగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా. స్వర్ణలత అన్నారు. ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20 మంది రోగులకు పోషకాహార (న్యూట్రిషన్) కిట్లను డా. స్వర్ణలత చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్షయ విభాగం ఉద్యోగులు కిశోర్, శ్రవణ్ కుమార్, రవీందర్‌రావు, పీహెచ్‌సీ ఉద్యోగి సిరాజుద్దీన్, ప్లాన్ ఇండియా ప్రతినిధి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ : క్షయను సమూలంగా నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బాలానగర్ మెడికల్ ఆఫీసర్ పద్మావతి అన్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 100 మంది బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ప్లాన్ ఇండియా (ఎన్జీవో) స్వచ్ఛంద సంస్థ న్యూట్రిషన్ కిట్లు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి వైద్యాధికారి మమత, టీబీ సూపర్‌వైజర్ మోహన్, రామకృష్ణ, కల్పన, రాజు, ప్లాన్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

బాలానగర్ : కల్యాణ్ నగర్ కాలనీవాసుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం వినాయక నగర్ లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయనను కలిసి కాలనీవాసులు తమ సమస్యలను వివరించారు. కాలుష్య జలాలు, లో ప్రెషర్ తాగునీరు సమస్యలను పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా తాగునీరు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన విధంగా తాగునీరు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఫోన్లో వివరించారు. కార్యక్రమంలో వసంత రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

కొంపల్లిలో పాదచారులకు అవగాహన కల్పిస్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్ : రోడ్డు ప్రమాదాల నివారణకు మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ నాగరాజు నేతృత్వంలో కొంపల్లిలో పాదచారులకు అవగాహన కల్పించారు. రోడ్డు దాటే సమయంలో సంయమనం పాటించాలని, సిగ్నల్స్ అనుసరించాలని సూచించారు. పాదచారులకు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశామని దానికి అనుగుణంగా రోడ్లు దాటాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాట రాదని, వచ్చిపోయే వాహనదారులకు చేయి అడ్డుపెట్టాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతిఒక్కరూ పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలని ఆశించారు.

బండి రమేశ్ క్షమాపణ చెప్పాలి

కేపీహెచ్‌బీ కాలనీ : అంబేద్కర్‌ను అవమానించిన కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ .. చేసిన తప్పుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ర్యాలీలో.. ఊరేగింపు వాహనం(గుర్రపు బగ్గీ)పై బండి రమేశ్.. అంబేద్కర్ చిత్రపటానికి అడ్డంగా కూర్చొని.. కాలు మీద కాలు వేసుకుని ఫొటోలకు ఫోజులు ఇవ్వడం బాధాకరమన్నారు. జరిగిన అవమానానికి తక్షణం వారితో పాటు వారి నాయకుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

20న 5,10 కే రన్ పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ : ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు 5, 10కే రన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్ అన్నారు. ఇగ్నైట్ విద్యా సంస్థలు, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద 20న నిర్వహించనున్న పోటీల మెడల్స్, టీ షర్ట్ లను డీసీపీ, కేపీహెచ్బీ కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఇగ్నైట్ చైర్మన్ రమేశ్, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు.

బాలానగర్ : ఫతేనగర్ డివిజన్ పరిధి ఇందిరాగాంధీపురం అంగన్‌వాడీ కేంద్రంల్లో పోషణ పక్షం నిర్వహించారు. మంగళవారం ఎర్రగడ్డ సెక్టార్ పరిధిలోని బల్కంపేట, ఇందిరాగాంధీ పురం, నేతాజీ నగర్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక శ్రీమంతం, చిన్నారులకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభా రాణి, భవిత, రేణుక, ఆశవర్కర్ గీత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కొండాపూర్ : 8వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో సీ కంపెనీ యాన్యువల్ రిఫ్రెషర్ కోర్సులో భాగంగా చందానగర్‌లోని న్యూ లైఫ్ అనాథాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి రెడ్డి చేతుల మీదుగా ఆశ్రమ నిర్వాహకులకు బియ్యం, వంటనూనె, బట్టలు, పండ్లను అందజేశారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు ప్రదానం

మియాపూర్ : బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌నకు చెందిన కప్పేర రమేశ్ తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల దండు రాష్ట్ర కోశాధికారి, సదుల విఠల్ ముత్తంగి రాష్ట్ర సహాయ కార్యదర్శి సంఘానికి చేసిన సేవలను గుర్తించి దళితరత్న అవార్డును చింతల రాజలింగం ఆధ్వర్యంలో బి.ఆర్. అంబేద్కర్, డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ – 2025, తెలంగాణ రాష్ట్రం ఇటుక రాజు మాదిగ వర్కింగ్ చైర్మన్, జయంతి ఉత్సవాల కమిటీ, చెరుకు రాంచందర్ వర్కింగ్ చైర్మన్, జయంతి ఉత్సవాల కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా దళితరత్న అవార్డును అందుకున్నారు.

చెట్లను కాపాడాలి

మాదాపూర్ : చెట్లను కాపాడాలని ప్రిన్సిపాల్ వందన కటారియా అన్నారు. అంతియ మాంటెస్సరీ పాఠశాలలో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కంచగచ్చిబౌలిలో చెట్లను నరకడం వలన విధ్వంసం జరుగుతుండటంతో విద్యార్థులు కలత చెందారన్నారు. మనకు ఇండ్లు ఉన్నాయి కానీ పక్షులు, జంతువులకు చెట్లే ఆధారమన్నారు. రానురాను ఆక్సిజన్ కొనుగోలు చేసే దుస్థితి నెలకొంటుందన్నారు. వారం రోజులుగా విద్యార్థులకు పర్యావరణ ప్రాముఖ్యతను తెలుపుతున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు కేటాయించండి

జడ్సీ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్ గౌడ్

బాలానగర్, ఏప్రిల్ 15 : ఫతేనగర్ డివిజన్ పరిధి అమృనగర్ తాండవాసులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ తాండవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం మూసాపేటలోని కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జడ్సీను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ సతీశ్ గౌడ్ మాట్లాడుతూ..40 ఏండ్లుగా 130 కుటుంబాల వారు కనీస సదుపాయాలు లేకుండా జీవిస్తున్నారని వారిలో 65 కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించిందని తెలిపారు. మిగిలిన కుటుంబాల వారికి కూడా ఇండ్లు కేటాయించి వారిని ఆదుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అమృనగర్ తండాలో కనీస సౌకర్యాలు లేకుండా గుడిసెలు వేసుకొని దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకునే తండావాసులను ప్రభుత్వం ఆదుకొని వారికి సొంత ఇంటి కలని నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గౌడ నాయక్, మోతియా నాయక్, పాండు నాయక్, సుదర్శన్ రెడ్డి, సురేందర్ నాయుడు పాల్గొన్నారు

కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

మియాపూర్ : హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీలో కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. కార్పొరేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరించి దశలవారీగా పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తానని హామీ ఇచ్చారు .కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు గోపీచంద్ అభినందనలు

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 15: గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో గోవాలో జరిగిన నేషనల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను బ్యాట్ జాయింట్ సెక్రటరి యూవీఎన్ బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరి కానూరి వంశీధర్ ఆధ్వర్యంలో వారిని మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు.

బీసీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలను వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

పీజీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పీజీ కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్ టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ బీఈ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (సీబీసీఎస్) ఏఐసీటీఈ కోర్సులు, బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

మృతికి కారకుడైన వైద్యుడి అరెస్ట్

దుండిగల్ : మహిళకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించి మృతికి కారణమైన ఓ వైద్యుడిని బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన సరస్వతి గతేడాది జూలైలో కడుపు నొప్పితో బాధపడుతూ బాచుపల్లి లోని ఎస్ఎల్‌జీ వైద్యశాలలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. ఆపరేషన్ చేసిన కొన్ని గంటలకే ఆమె తీవ్ర అస్వస్థతకు గురై తుది శ్వాస విడిచింది. దీనిపై మృతురాలి కొడుకు అదే రోజు వైద్యశాల యాజమాన్యం, డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తన తల్లి చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం రిపోర్ట్ కోసం ఇన్నాళ్లు వెయిట్ చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో మృతురాలికి సరైన వైద్యం అందించని కారణంగానే చనిపోయినట్లు తేలింది. సరస్వతికి శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుడు డా. ఎస్.సతీశ్ కుమార్ ను పోలీసులు మంగళవారం రిమాండ్ కు తరలించారు. కాగా మేనేజ్‌మెంట్ పైనా కేసు నమోదు చేశామని, చర్యలు సైతం తీసుకుంటామని సీఐ ఉపేందర్ పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 15, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి10, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 38, ఆలుగడ్డ 24, కీరా 15, దోసకాయ 23, సొరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 85, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 17, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.